క్లుప్తంగా

కిటకిటలాడిన మూల పెద్దమ్మ ఆలయం



మూల పెద్దమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్దమ్మ వారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేషపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కల్లూరు: రైతులు పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్సీ వ్యవసాయ అధికారి నాగ సరోజమ్మ సూచించారు. మంగళవారం ఎ.గోకులపాడు, కె.మార్కాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ప్రతి రైతు నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు వల్ల ప్రభుత్వ పథకాలు, మద్దతు ధరకు కొనుగోలు వర్తిస్తాయన్నారు. ఎన్‌పీసీఐ లింక్ కాని రైతులు బ్యాంకుకు వెళ్లి చేయించుకోవాలని సూచించారు.

వర్షం కోసం పూజలు



వల్లెలాంబదేవి పల్లకీ సేవను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

కోడుమూరు రూరల్: వానల్లేక పంటలు ఎండిపోతుండటాన్ని తట్టుకోలేక కోడుమూరు రైతులు వర్షం కురిపించాలని కోరుతూ వల్లెలాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కోడుమూరులోని వల్లెలాంబదేవి ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని పల్లకీలో ఆశీనులను చేసి మంగళవారం ఉదయం కాలినడకన వెంకటగిరిలోని మసికొండకు ఊరేగింపుగా చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలనంతరం తిరిగి కోడుమూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచు భాగ్యరత్న, గ్రామపెద్దలు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారిని పట్టణ పురవీధుల గుండా ఊరేగిస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టణ ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించి వాన కురిపించాలని మొక్కుకున్నారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నేషనల్ హైవేస్ డిప్యూటీ కలెక్టర్ సునితాబాయ్

కర్నూలు(రూరల్): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని నేషనల్ హైవేస్ డిప్యూటీ కలెక్టర్ సునితాబాయ్ సూచించారు. ఆమె మంగళవారం కర్నూలు మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం కర్నూలు అర్బన్ తహసీల్దారు రవికుమార్, రూరల్ తహసీల్దారు టీ.వీ. రమేష్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను పరిశీలించి వివిధ అంశాలపై సూచనలు చేశారు. అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. భూ సమస్యలను పరిష్కరించారా? లేదా? ఏ కారణం వల్ల పరిష్కరించలేదు. భూమి కొలతలు, మ్యుటేషన్ తదితర సమస్యలపై వచ్చిన అర్జీదారులను రెవెన్యూ అధికారులు లంచం అడుగుతున్నారా? అని విజయవాడ నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఎప్పటికప్పుడు రైతుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. రెవెన్యూ అధికారులు రైతులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా, జవాబుదారీతనం పాటిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు. అదే విధంగా అసైన్డ్ పట్టా భూములను గుర్తించడం, అన్యాక్రాంతం కాకుండా చూడటం, ప్రభుత్వ భూములను కాపాడటం, క్రిమీలేయర్ -నాన్ క్రిమీలేయర్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కర్నూలు రూరల్, అర్బన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రిజర్వాయర్ కట్ట పనులు

పూర్తయ్యేదెన్నడో?

- 2017లోనే కుంగిన రిజర్వాయర్ కట్ట
- మరమ్మతులు చేయాలని సూచించిన అప్పటి ఇంజినీర్లు
- మరమ్మతుల కోసం రిజర్వాయర్ ఖాళీ
- సాగునీరు లేక పంటపొలాలు బీడు పెట్టుకుంటున్న రైతులు
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్న అన్నదాతలు
- శాశ్వత పనులు చేయాలంటున్న రైతులు



రిజర్వాయర్ కట్ట కుంగిన దృశ్యం (ఫైల్)



నీరు లేక ఖాళీగా ఉన్న అలగనూరు రిజర్వాయర్

గడివేముల: మండల పరిధిలోని అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్ట కుంగిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో రిజర్వాయర్‌లో ఉన్న నీటిని అధికారులు బయటికి వదిలేసి ఖాళీ చేశారు. వందలాది ఎకరాలు బీడుగా మారాయి. 1987లో అలగనూరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. మిడ్తూరు మండలం అలగనూరు గ్రామ సమీపంలో కేసీ కెనాల్ 119 కి.మీ వద్ద రిజార్వాయర్ నిర్మాణానికి రూ.3.06 కోట్లతో పరిపాలన అనుమతులు వచ్చాయి. ఈ మేరకు జీఓ ఎంఎస్ 327 జారీ అయ్యింది. 1993 వరకు దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. జైకా నిధులతో కేసీ కెనాల్ ఆధునికీకరించే పనుల్లో భాగంగా రూ.59.90 కోట్లతో అలగనూరును చేపట్టారు. పనులు ఆలస్యమై 2004లో పూర్తయ్యాయి. రిజర్వాయర్ కెపాసిటీ మూడు టీఎంసీలు. ఇదిలాఉండగా 2017లో ఒకచోట కట్ట బలహీన పడి కుంగింది. అప్పటి ప్రభుత్వం కుంగిన ప్రాంతంలో తాత్కాలికంగా ఇసుక సంచులు వేసి నీటిని నిల్వచేసింది. కాలక్రమేణ కట్ట మరింత బలహీన పడటంతో రిజర్వాయర్‌లో నీటిని నింపడం ప్రమాదకరంగా మారింది. కదిలిన యంత్రాంగం రిటైర్డ్ నీటి పారుదల శాఖాధికారులు, నిపుణులచే సర్వే చేయించారు. గత ప్రభుత్వం కట్ట పటిష్టతకు రూ.3.12 కోట్లు మంజూరు చేసింది. అయితే కట్ట కుంగిన ప్రాంతం మరింత పెరగడంతో రూ.18 కోట్ల దాకా ఎస్టిమేషన్ పంపారు. అంతలోనే ఎన్నికలు రావడంతో నిధులు మంజూరు కాలేదు. రిజర్వాయర్ కింద ఉండే గ్రామాల్లోని వందలాది ఎకరాల సాగు నిలిచిపోయి బీడుగా మారాయి. ముఖ్యంగా గడివేముల, బూజునూరు, చిందుకూరు, గడిగరేవుల, తిరుపాడు, కొరటమద్ది, పులిమద్ది గ్రామాల్లోని రైతులకు, ప్రజలకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

అప్పుడే శాశ్వత పనులు చేసింటే బాగుండేది

2017లో రిజర్వాయర్ కట్ట కుంగినప్పుడే శాశ్వత మరమ్మతులు చేయించి ఉంటే బాగుండేదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు మొదలు పెట్టి పనులు పూర్తి చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. గత ఏడాది నంద్యాల జిల్లా కలెక్టర్ కట్ట కుంగిన ప్రాంతాన్ని పలువురు అధికారులతో కలిసి పరిశీలించి అంచనాలు వేశారు. రివైజ్‌డ్ ఎస్టిమేషన్ వేసి రూ.36 కోట్లకు ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంతవరకు రిజర్వాయర్‌కు నిధులు కేటాయిస్తామని చెప్పడమే తప్ప స్పష్టమైన హామీ రాలేదు.

ఇదీ సమస్య

కోర్టు కేసుల కారణంగా రిజర్వాయర్ ఎర్త్ బండ్ చాలా కాలంపాటు ఆగిపోయింది. లోతైన కొండ గట్టు పోర్షన్‌లో నేల స్థాయి కంటే తక్కువ పొరల కుదింపు జరుగలేదు. ఈ రిజర్వాయర్ పనులు జరుగుతున్న సమయంలో గడివేముల నుంచి రోళ్లపాడు గ్రామానికి వెళ్లేందుకు ఉన్న రోడ్డును తొలగించకుండా, ఎలాంటి ట్రెంచెస్ వేయకుండానే నిర్మాణం చేపట్టారనే విమర్శలు ఉన్నాయి. నిపుణుల కమిటీ సైతం ఇదే అనుమానం వ్యక్తం చేసింది. రోడ్డు ఉన్న ప్రాంతం, గతంలో ఇక్కడ ఉండే చెరువులోకి నీరు వచ్చేందుకు ఉండే వాగు మట్టిని తొలగించకపోవడంతోనే బండ్ కుంగిందని తెలుస్తోంది. రిజర్వాయర్ లోపల వైపునకు 2.5 కి.మీ నుంచి 2.65 కి.మీ, 2.75 నుంచి 2.85 కి.మీ, 2.9 కి.మీ నుంచి 3.00 కి.మీ, 3.15 నుంచి 3.25 కి.మీ వరకు, పైభాగంలో 2.65 కి.మీ నుంచి 2.75 కి.మీ వరకు బండ్ కుంగింది. దిగువ భాగంలో కూడా కొన్ని చోట్ల నీరు సీపేజ్ అవుతున్నట్లు అప్పటి ఇంజినీర్లు గుర్తించారు.

నాడు పట్టించుకోని టీడీపీ

2017లో కట్ట కుంగిన వెంటనే టీడీపీ ప్రభుత్వం మరమ్మతు పనులు చేయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. రిజర్వాయర్ కింద ఆయకట్టు లేకపోయినా గడివేములతో పాటు బూజునూరు, చిందుకూరు, గడిగరేవుల, కొరటమద్ది, పులిమద్ది గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లోని బోర్లలో నీరు బాగా ఉండేదని రైతులు చెబుతున్నారు. దీంతో పాటు పశువులకు, కుందూనది నుంచి మోటర్లు వేసుకుని పంటలు సాగుకు ఎంతో ఉపయోగపడుతుంది. రిజర్వాయర్‌లో ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో రిజర్వాయర్‌లో కొంతమంది రైతులు పంటలు సాగు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి నాయకులు రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

హామీ నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుంగిన కట్టకు మరమ్మతులు చేయించాలి. రిజర్వాయర్‌లో నీటి నిల్వ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు పడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు త్వరగా నిధులు మంజూరు చేయించి మరమ్మతులు చేయిస్తే తాగు, సాగునీటి సమస్యలు తీరతాయి. -సర్వేశ్‌రెడ్డి, అల్లగడ్డ గ్రామం

త్వరగా పూర్తి చేయండి



2017లోనే రిజర్వాయర్ కట్ట కుంగింది. అప్పుడే మరమ్మతులు చేపట్టి ఉంటే ఈ కష్టాలు వచ్చేవికావు. తాత్కాలికంగా సంచులలో ఇసుక నింపి వేసి మరమ్మతులు చేశారు. రిజర్వాయర్ కింద వందలాది ఎకరాలు బీడుగా మారాయి. వెంటనే మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టి త్వరగా పూర్తి చేయాలి.
– బీఎస్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్, గడిగరేవుల

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి



ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఓవర్ హెడ్ స్టోరేజ్ (ఓహెచ్ఎస్ఆర్) ట్యాంకులకు ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి భూమి పూజ నిర్వహించి, పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ నిధులను వినియోగించి తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాల్వ గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1.12 కోట్లు మంజూరు కాగా సచివాలయం వద్ద 90 వేల లీటర్ల సామర్థ్యంతో, నవాజ్ కట్ట ప్రాంతంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంకులను నిర్మిస్తున్నట్లు చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ.. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంతకుముందు కలెక్టర్, ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ గ్రామ శివారులోని కోనేటి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, సర్పంచులు కేపీ వెంకటేశ్వర్లు, చంద్ర గోవర్ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష



ఉత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కోడుమూరు రూరల్: మండలంలో ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలను జయప్రదం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవ ఏర్పాట్లపై పోలీస్, రెవెన్యూ, ఎలక్ట్రికల్, ఫైర్, పంచాయతీ సిబ్బంది, వినాయక కమిటీ సభ్యులు సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు కోడుమూరులో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. చవితి ఉత్సవాల్లో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, వినాయక కమిటీ సభ్యులంతా కలిసికట్టుగా పనిచేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని తహసీల్దార్ సూచించారు. గ్రామ సర్పంచు భాగ్యరత్న, అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్మీ నిర్వహణపై శిక్షణ

పాణ్యం: మండల పరిధిలోని కౌలురు గ్రామంలో వర్మీ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల జిల్లా డీపీఓ లలితాబాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజూ చెత్త సేకరణ సక్రమంగా జరగాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలన్నారు. అనంతరం చెత్తను నిర్వహణ కేంద్రానికి తరలించాలన్నారు. అక్కడి సిబ్బంది తడి, పొడి చెత్తను వేరు చేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువును తయారుచేస్తారన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం జరగాలని సూచించారు. ఈ క్రమంలో గ్రామాల శుభ్రతతో పాటు, పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. చెత్త సేకరణలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, చెత్త నుంచి సేంద్రియ ఎరువు ఎలా తయారు చేయాలనే అంశంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ ఊడల బాలయ్య, డీపీఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు టెండర్లు

పాణ్యం: పాణ్యం – కొణిదేడు గ్రామాల మధ్య రూ.2.50 కోట్లతో చేపట్టే విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనల ప్రక్రియ పూర్తి చేసినట్లు అర్‌అండ్‌బీ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పాణ్యం పట్టణం నుంచి నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకు సంబధించి టెండర్‌కు పంపినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపడతామన్నారు. 7 మీటర్ల వెడల్పుతో రోడ్డును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చాయని, ఈ పనులకు టెండర్ పిలిచేందుకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ అంతరాయంతో నీటి సమస్య

పాణ్యం: విద్యుత్ అంతరాయంతో ఏపీ మోడల్ స్కూల్‌లో నీటి సమస్య తలెత్తిందని, ట్యాంకర్ల ద్వారా నీటిని అందించినట్లు ఎంఈఓ-2 సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం సుగాలిమెట్ట గ్రామానికి విద్యుత్ సరఫరా అందించే లైన్ల సమస్య రావడంతో పాఠశాలలో నీటి సమస్య ఏర్పడింది. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి ఇబ్బంది లేకుండా చేశారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో హైవే వద్ద పాణ్యం నుంచి సుగాలిమెట్టకు విద్యుత్ సరఫరా చేసే తీగలపై చెట్టు విరిగి పడింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరమ్మతుల అనంతరం సాయంత్రం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

ఓర్వకల్లు: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని ఏపీడీ పద్మావతి సూచించారు. మంగళవారం స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయ భవనంలో ఉపాధి సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఓ మద్దీశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. రానున్న కాలంలో సాంకేతిక పరిజ్ఞానంతోనే ఉపాధి పనులు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫారం పాండ్స్, మొక్కల పెంపకం, ఎస్ఎంఎంఎస్ భువన్, జియోట్యాగింగ్ తదితర అంశాలపై రిసోర్సు పర్సన్లు మధువెంకటకృష్ణ, భాగ్యరాజు, ఉషా శిక్షణ ఇచ్చారు. కోర్సు డైరెక్టర్లు సుజాతమ్మ, నాగ ఎర్రమల, ఏపీఓ మద్దీశ్వరమ్మ, ఓర్వకల్లు, కల్లూరు, వెల్దుర్తి, క్రిష్ణగిరి, కర్నూలు మండలాలకు చెందిన సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దత్తత కుటుంబాలపై మార్గదర్శకులకు అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు: ప్రభుత్వం చేపట్టిన పీ – 4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేలా మార్గదర్శకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలపై పీ – 4 సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలను నిర్మూలించాలనే ఉద్దేశంతో గ్రామంలో కనీసం 5 కుటుంబాలకు తగ్గకుండా బంగారు కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సర్వేలో గుర్తించిన కుటుంబాలకు మార్గదర్శకుల ద్వారా తగిన సహాయం అందించి, ఆ కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకరావాలని సూచించారు. రేషన్ డీలర్లు తమ పరిధిలో ఎంపికైన బంగారు కుటంబాలకు ప్రతి నెలా ఉచితంగా రేషన్ బియ్యం సరఫరా చేయాలన్నారు. ఆర్థికంగా బలపడిన ఎరువుల దుకాణ డీలర్లు, వ్యాపారవేత్తలు, హోటల్ నిర్వాహకులు, పరిశ్రమల ప్రతినిధులు తమ వంతుగా ఆర్థిక తోడ్పాటునందించి, పేదరికం నుంచి బయటపడేలా చూడాలన్నారు. ఆయా గ్రామాల డీలర్లు, వ్యాపారవేత్తలు, హోటల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం



మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గడివేముల: మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారమవుతుందని ఎస్ఐ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. పిల్లలు బాగా చదువుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలన్నారు. చెడు మార్గంలో వెళ్లరాదన్నారు. మద్యం అలవాటు ఉన్న వారు కుటుంబ సభ్యులను, పొరుగు వారిని ఎంతగా ఇబ్బంది పెడతారో చూస్తుంటామని గుర్తు చేశారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ లాంటి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సిగరెట్లు కాల్చడం, మద్యం తాగడం, అమ్మాయిలను కామెంట్ చేయడం ఫ్యాషన్‌గా ఫీలవుతున్నారని అదే వారి నాశనానికి తొలిమెట్టన్నారు. ప్రతి స్కూల్‌లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని, వారు తమ స్కూల్‌లో, పరిసరాల్లో డ్రగ్స్ గురించిన సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కు గానీ, వాట్సాప్ నంబర్ 8977781972కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు బయటకు తెలియకుండా జీఓ

- వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఓర్వకల్లు: పాఠశాల విద్యా హక్కులను హరించే జీఓను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇది విద్యార్థుల సమస్యలు బయటకు తెలియకుండా నోరు నొక్కే ప్రయత్నమేనని మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, విద్యాశాఖ కమిషనర్ విడుదల చేసిన కరపత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పలు విద్యార్థి సంఘాల నాయకులు రవీంద్రనాథ్, అయ్యన్న, సురేంద్ర మాట్లాడుతూ.. పాఠశాలల్లోకి ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు మినహా, మిగతా వారిని అనుమతించరాదని చెప్పడం ప్రజాస్వామ్య హక్కులను హరించమేనన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు జరిపేవారని గుర్తుచేశారు. విద్యాశాఖ పీటీఎం పేరుతో చేసేందేమిటని, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు పాఠశాలల్లోకి వచ్చి సమస్యలు చెప్పిన వారిని బెదిరించారని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వుల వల్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారాన్ని, అక్కడ జరిగే అరాచకాలను వామపక్ష విద్యార్థి సంఘాలు అడ్డుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశాలు ఉండవని వివరించారు. విద్యార్థుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్న జీఓను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. విద్యార్థి సంఘం నాయకులు సుబ్బయ్య, హరి, శివ తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: పాఠశాలల్లోకి పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవ్వరినీ అనుమతించకుండా ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఖాజావలి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గూడూరులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆ ఉత్తర్వుల కాపీలను కాల్చివేసి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు వేణు, అరవింద్, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దుకు పోరాటం

- సబ్‌స్టేషన్ల వద్ద కార్మిక, ప్రజా సంఘాల నాయకుల నిరసన
- కూటమి ప్రభుత్వం ద్వంద వైఖరిపై మండిపాటు



కోడుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు



పాణ్యంలో విద్యుత్ శాఖ అధికారికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం



కల్లూరు: విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: ప్రజలకు భారంగా మారిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి అవుల శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోడుమూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు వామపక్ష పార్టీల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అవుల శేఖర్ మాట్లాడుతూ..గత వైఎస్సార్‌సీపీ హయాంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టండన్న కూటమి నాయకులు, నేడు అదే మీటర్లను బిగిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ సిబ్బందికి అందజేశారు. వామపక్ష పార్టీల నాయకులు క్రిష్ట, గఫూర్‌మియ్యా, రాజు, వీరన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

- కార్పొరేట్లకు దోచి పెట్టే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గూడూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రజాసంఘాల ఐక్య వేదిక మండల నాయకులు మోహన్, రవి, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, నాగరాజు, కోటయ్య, మధు, దానమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం ప్రజల నివాసాలకు విద్యుత్ స్మార్టు మీటర్లను అమర్చే విధానాన్ని మానుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, అధికారులకు వినతి పత్రం అందజేశారు. వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయడమేగాక, కరెంటు చార్జీలను తగ్గిస్తామని మాయమాటలు చెప్పి, అధికారంలోకి రాగానే విస్మరించడం సిగ్గుచేటన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీధర్, మండల అధ్యక్షుడు షాజహాన్, రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

- **కల్లూరు:** స్మార్ట్ మీటర్లు రద్దు చేయకుంటే మరో విద్యుత్ పోరాటం చేస్తామని వామపక్ష ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. మంగళవారం సీపీఎం, డీవైఎఫ్ఐ, సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు ఉలిందకొండ విద్యుత్ కార్యాలయం, కల్లూరు ఎస్టేట్‌లోని ఏఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి విద్యుత్ అధికారులకు వినతి పత్రమిచ్చారు. నాయకులు సాయిబాబా, సుధాకరప్ప, కృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే చర్యలు తప్పవని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలని, డిప్యూటీ ఎంపీడీఓలు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో పాటు డిప్యూటీ ఎంపీడీఓలపై చర్యలు ఉంటాయన్నారు. డీపీఓ జి.భాస్కర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. చెత్త సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేయాలన్నారు. డివిజనల్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ అధికారులు, డీసీడీపీఆర్సీ మంజులవాణి, ఎంపీడీఓలు, కల్లూరు మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.